స్కెచ్

# మాయని గాయం

యం. హీరాలాల్ రాయ్

"నన్ను నువ్వు దుర్మార్గుడే అనుకో, సన్మార్గుడే అనుకో, నేనుమాత్రం మార్గంమీద నడచేవాడిని. నాకు తెలుసు: దారిప్రక్క రాళ్లు, రప్పలు, ముళ్ళూ ఉంటాయని. నేను నా గుర్తులో ఎన్నడూ చెప్పుల్లేకుండా దారిన నడవలేదు. దారిన నడిచేప్పుడు, ఆకాశంవైపు యెన్నడూ చూడలేదు. ఎన్నడూ నడకలో పొరపాటై కాలు మలకపడ్డ వాణ్ణి కాదు. గంటకు మైలూ, మైలున్నరకంటె ఎక్కువ 'స్పీడు' ఎన్నడూ నా కాళ్ళకు అలవాటులేదు. వెనుక బళ్లో చదువుకునే రోజుల్లో సైతం ఈ స్పీడును మించి 'లెఫ్టు-రైట్' చేసేవాణ్ణి కాదు. బంతి ఆడటం, బలిగుడు ఆడటం అంటే నాకు విపరీతమైన భయం. అటునుంచి పంతులు వస్తున్నాడని తెలిసి ఇటు ఏమూలకో పరుగెత్తేవాణ్ణి కాదు. పంతులు ఏమన్నా సరే దారితప్పి నడవడం నాచేత కాకపోయేది. కాయితంమీద పక్కవాటుగానో, వంకరగానో రాయడం అంటే నాకు నచ్చేది కాదు.

ఇట్టి నేను దారితప్పి నడిచాననీ, దుర్మార్గుణ్ణనీ, కింద యేముందో చూడకుండా దూకాననీ, దూకేప్పుడు గోడ బెడ్డలురాలాయనీ, కింద బండవుందనీ, ఆ బండమీద అమాంతం పడేప్పటికి నాకాలు బెణికిపోయిందనీ, వో కాలికి పెద్ద గాయం తగిలిందనీ, అది యింకా మానక బాధ పెడుతోందనీ, చెబుతూ తిరుగుతున్నాడు రామం. గాయం యెందుకు మానడంలేదో డాక్టరుకే తెలీదు. గాయం యెందుకైందో నీకూ తెలీదు. రామం చెబుతున్నదాంట్లో ఎంతవరకూ నిజంవుందో నాకూ తెలీదు. అయితే, ఒక్క సంగతి. నీకు రాయంది తప్పదు గనుక రాస్తున్నాను." అని వుత్తరం ఆపేశాను. ఆ ఒక్క సంగతి ఏమి వ్రాయాలో తోచలేదు. హాస్పిటలులో నాల్గుమూలలూ పిచ్చివాడి మాదిరి చూశాను. రోగులూ, మంచాలూ, ఫ్యాన్లూ, మందుసీసాల అల్మైరాలూ, కిటికీలూ, నిర్జీవమైన యీ వస్తువులతో విసిగెత్తివున్న నాకు అబద్ధాల గాయం బాధ కడు ఘోరంగా పరిణమించింది. మంచం దిగి కిటికీలోంచి తొంగి ఆ బయటి ప్రపంచాన్ని దర్శించే యోగం యింక యెన్నాళ్ళకో?

నా మోకాలికి గాయం లేదని నాకు తెలుసు. ఈ రహస్యం ఎవడికీ తెలియకుండా ఉంచాలనీ తెలుసు. అయితే యిలా గాయం లేందే, బాధ పడుతూ మంచంలో కుమిలిపోవడం యింకా ఎంతో కాలం చేతకాదనీ తెలుసు. ఇలా డాక్టరునీ, నర్సునీ, కట్టుకొని గాయం ఉందని నాటకం ఆడుతూ, హాస్పిటల్లో "ఇన్‌పేషెంటు"గా పడివుంటే వున్న వొకేవొక ఆనందం ఆమె దర్శనం, ఆమె స్పర్శనం.

నా మోకాలు ఎన్నటికీ బాగుకాకుండా వుండాలని రామం కొబ్బరికాయలు కొట్టాడు. దేవుళ్ళకు మొక్కులు మొక్కుకున్నాడు. అభిషేకాలు చేయించాడు. యిన్ని బాధలుపడుతూ కూడా వాడికి భయం. ఎక్కడ నేను మంచం లోంచి లేస్తానో, ఎక్కడ నడుస్తానో అని. అయితే నేను హాస్పిటల్లో ఉన్న పదిరోజులూ రామం హాయిగా తన యిచ్చవచ్చిన చోటికి తిరుగ గలుగుతున్నాడు. తన యింటినిగానీ, 'ఆమె'నిగానీ యింక కాపలా కాయవలసిన అవసరం లేదు. రోజూ హాస్పిటల్‌కు వచ్చి నాకు తెలీకుండా డాక్టరుని కలుసుకొని నా గాయం గురించి అడుగుతున్నాడు. డాక్టరు ఎవడో! వాడికీ నాకూ ఎట్టి చుట్టరికమో వాడికి తెలీదు పాపం!

నిన్న ఏడింటికి కబురు తెచ్చింది నర్సు. రామం వూరికి వెళ్లాడనీ, 'ఆమె' నన్ను రమ్మందనీ. సరిగా తొమ్మిది గంటలకు నేను ఆనాడు బెడ్డలు రాలగొట్టిన గోడవద్ద నుంచి యీల

వేశాను. ఆమె తలుపు తెరచింది. ఆనాడు అదే తలుపు తెరచి నన్ను పిలచింది. గోడ బెడ్డ రాలగొట్టమని ఓ చిన్న యినుపకమ్మి యిచ్చింది

నాకు ఆమెను కావిలించుకోవాలనే తొందర గానీ, ఆమెను ముద్దెట్టుకోవాలని గాని ఎన్నడూ లేదు. ఆమెకూ నానుండీ ఏదో అనుభవించాలనీ లేదు. నేను ఆమెను చిరకాలం నుంచీ ఆముగుదామనుకున్నది వొక్కటే. అది యేమిటంటే ఆమె నన్ను ఎందుకు యిలా పిలుస్తుందీ అని. ఆకాస్త అడగడానికి ఇవాళటికీ వీలు కాలేదు. కనపడగానే నవ్వుతుంది. నవ్వి మొహం తుడుచుకుంటుంది. నా షర్టు కాలరు పట్టుకొని లాగుతుంది. 'చూయింగ్‌గం' బిళ్లలు అందిస్తుంది. రామం మంచివాడు. అతనికి నీమీద కోపానికి కారణం లేదు అంటుంది. అది అతనికి ఒక జబ్బు అంటుంది. ఎందుకోగాని నాకు ఆమెను ద్వేషించడం రాదు. చేతగాదు. ఆమె పిలిచినప్పుడల్లా వెళ్ళడం, వెళ్లడానికి అడ్డుగా రామం ఉంటే మోకాలు పగిలినట్టు నటించడం, ఇక నేను ఆమెను కలుసుకోలేనని రామం నమ్మితే ఎటోపోతాడు. మళ్ళీ ఆమె నాకు దర్శనం.

"అయితే ఒక్కసంగతి నీకు రాయంది తప్పదు గనుక రాస్తున్నాను." యిప్పుడు కాస్త ఖుర్రలోకి కొత్తఊహ వచ్చింది. "ఆ కొత్త సంగతి యేమిటంటే ఆమెకూ రామంకూ కూడా నాకూ ఆమెకూ ఉన్నంతపాటి చుట్టరికమే. అయితే ఆమె వాడియింట్లో ఉంది నేను వాడి యింటికి దూరంగా ఉన్నాను. ఆమె వాణ్ణీ నన్నూకూడా యేడిపిస్తోంది. వాడూ నేనూ తగవులాడుతున్నాం. యిదంతా యెందుకని నిరాశ చేసుకుందామంటే మనసు వప్పదు. ఆమెను చూడందే బ్రతకడం కష్టం. నాకు యీ గాయం మానాలని లేదు. అసలు గాయంలేదు. యిలాగే మంచంలో పడివుంటేనన్నా కొన్ని అటంకాలు తగ్గి ఆమెను చూడగలుగుతాను. ఈ గాయం మానాలని నాకూ లేదు. రామానికీ లేదు. మరి నీకుమాత్రం ఉంటుందా?" ఉత్తరం ముగించి కవరుమీద సోమేంద్రనాథ్ త్రిపాఠీ, హుబ్లీ, కలకత్తా అని రాసేసి వుమ్మితో కవరు అంటించాను.

"ఆమె వెంటనే రమ్మంటోంది పద, పద" అంది నర్సు.

గబగబా కోటువేసుకొని బైల్దేరాను.

ఇంట్లోకి పరుగెత్తాను. రామం, ఆమే కాఫీ త్రాగుతున్నారు.

"ఓరి దొంగ! ఎంత అబద్ధం ఆడావురా! నీ మోకాలు నొప్పి అబద్ధం అటగా" అన్నాడు రామం.

"అబద్ధం గాక నిజమెలా వుంటుంది? అతను మనింటికి రావడమేమిటి? మీరు రావడం చూచి గోడదూకడం ఏమిటి? కాలుకు దెబ్బతగలడం యేమిటి? మీరు ఎలా నమ్మారండీ? అతనికీ నాకూ ఏంసంబంధం? గోడదూకేసినట్టు నీకు తెలిస్తేనైనా నన్ను నువ్వువదిలేసి యింకోదాని కోసం వెతుక్కుంటావనీ, నేను సులభంగా అతనికి దక్కిపోతాననీ ఎత్తువేశాడు ఏదీ కట్టువిప్పి చూడు." అంటూ ఆమె గబగబా నా మోకాలు మీద గుడ్డ లాగేసింది. నాకు పెద్దగా యేడుపొచ్చింది. అమ్మ! దొంగా! యిది ఎంతపని చేసింది! అని విచారపడ్డాను. దుఃఖించాను. ఎక్కడా తోచక మళ్ళీవచ్చి హాస్పిటల్లో నా పక్కమీద పడివున్నాను డాక్టరు నన్ను చీవాట్లు వేశాడు. యీ రహస్యం బైట పడ్డందుకు అతన్ని పై అధికారులు కోప్పిస్తారని భయపడ్డాడు. మోకాలు మీద గాయం అయితే లేదు కాని, గుండెలో మాత్రం మాయని గాయం యేర్పడ్డది."

